క్లుప్తంగా

బీరువా బహూకరణ


పాఠశాలకు బీరువా అందజేస్తున్న అప్పిరెడ్డి

చిలుకూరు : మండలంలోని నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.13 వేలు విలువ గల బీరువాను ఆ పాఠశాల రిటైర్డు ఉపాధ్యాయుడు అప్పిరెడ్డి బుధవారం బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుజ్జుల నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డైరీలు పంపిణీ


డైరీలు పంపిణీ చేస్తున్న దాతలు

నడిగూడెం : మండలంలోని కరివిరాల మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు బుధవారం కోదాడకు చెందిన మైత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎస్‌కె.జబ్బార్ డైరీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాయి ఈశ్వరి, సంస్థ ప్రతినిధులు భట్టు కేవల్ పంత్, కొత్తపల్లి రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

అనంతగిరి : వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించాలని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని శాంతినగర్‌లో గల బాలుర వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. వంట గది, డైనింగ్ హాల్, స్టోర్ రూం, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

గరిడేపల్లి : వానాకాలం సీజన్‌లో యూరియా కొరత రాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని, వానాకాలం ప్రారంభంలోనే ఇలా ఉంటే ముున్ముందు ఎలా ఉంటుందోనని అన్నారు.

కాంగ్రెస్ బహిరంగ సభను జయప్రదం చేయాలి

మునగాల : హైదరాబాద్‌లో ఈనెల 4వ తేదీన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించబోయే బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తక్కెళ్లపాటి సాయి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలో గ్రామశాఖ అధ్యక్షులు, మండల నాయకులు, ముఖ్య కార్యకర్తలు హాజరుకావాలని వారు కోరారు.

పీర్ల ఊరేగింపు


గరిడేపల్లిలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

గరిడేపల్లి : మండల కేంద్రంతో పాటు గానుగబండ, కట్టవారిగూడెం, తదితర గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం గ్రామాల్లో పీర్లను ఊరేగించి ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీలు వేయాలి

మునగాల : రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో కమిటీలు వేయాలని డీవైఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు బచ్చలకూరి సురేందర్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజు ల దోపిడీ జరుగుతుందని, ఫీజుల నియంత్రణకు కమిటీలు అవసరమన్నారు. ఫీజుల నియంత్రణకు విద్యాశాఖ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి ఏడాది ఫీజులు ఎంత పెంచాలి? పాఠశాలల్లో సదుపాయాలపై నిర్ణయం తీసుకునే అధికారం ఈ కమిటీలకు ఉండాలని కోరారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికపై హర్షం


ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

మునగాల : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ నారపరాజు రామచంద్రరావు ఎన్నిక పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం రాత్రి మునగాలలో బీజేపీ మండల అధ్యక్షుడు మైలారిశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కనగాల నారాయణ, బి.కృష్ణప్రసాద్, మండల నాయకులు మండవ చినసైదులు, ఆర్.శ్రీనివాసరెడ్డి, వి.వీరబాబు, గోవిందాచారి, పసర రమేష్, బేతం కపిల్‌రెడ్డి, వినోద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధ్వాన రోడ్డుపై ప్రయాణించేదెలా..

- గుంతలమయంగా వెంకట్రాంపురం రహదారి
- పదిహేనేళ్లుగా మరమ్మతులు కరువు
- డబుల్ రోడ్డుగా మార్చాలని ప్రజల వేడుకోలు


గుంతలమయంగా వెంకట్రాంపురం రోడ్డు

మునగాల : మండలంలోని వెంకట్రాంపురం రోడ్డు అధ్వానంగా తయారైంది. నేలమర్రి నుంచి తాడువాయి, వెంకట్రాంపురం గ్రామాల మీదుగా జాతీయ రహదారిపై గల ఎస్‌ఎంపేట స్టేజీ వరకు 10 కిలోమీటర్ల మేర ఉన్న ఈ రోడ్డుపై మోకాళ్లలోతు గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా వెంకట్రాంపురం, నేలమర్రి గ్రామాలకు చెందిన ప్రజలు మండల కేంద్రానికి చేరుకోవాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. సుమారు దశాబ్దకాలం క్రితం ఈ రోడ్డును బీటీ రోడ్డుగా నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టలేదు. దీంతో వర్షం వస్తే గుంతల్లో నీరు నిలిచి ప్రయాణించే వీలు లేకుండా పోయింది. దీనికి తోడు రోడ్డు మూలమలుపులతో ఉండడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ రహదారిపై గతంలో ఏర్పాటు చేసిన కల్వర్టులు సైతం కుంగిపోవడంతో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు ఇరువైపుల ఆక్రమణకు గురవుతుండడంతో ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చుతామని ఎన్నికల సమయంలో పలు పార్టీల నాయకులు ఇచ్చిన హామీలు నేటికి అమలుకు నోచుకోలేదు. ఇప్పటికైనా రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

డబుల్ రోడ్డుగా మార్చాలి



“జాతీయ రహదారిపై ఉన్న ఎస్‌ఎంపేట స్టేజీ వద్ద నుంచి తాడువాయి, వెంకట్రాంపురం గ్రామాల మీదుగా నేలమర్రి వరకు గల రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి.

– మాతంగి అంబేద్కర్, సామాజిక కార్యకర్త, తాడువాయి

ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లాం



“వెంకట్రాంపురం రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు నిధులు మంజూరు చేయాలని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి దృష్టికి తీసుకువెళ్లాం. ఆమె సానుకూలంగా స్పందించి డబుల్ రోడ్డు నిర్మాణానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

– తక్కెళ్లపాటి సాయి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, వెంకట్రాంపురం

ప్రతిపాదనలు పంపాం



“నేలమర్రి నుంచి ఎస్‌ఎంపేట గ్రామం వరకు సుమారు పది కిలోమీటర్ల అర్‌అండ్‌బీ రోడ్డును డబుల్‌రోడ్డుగా మార్చేందుకు గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఇప్పటి వరకు మంజూరు కాలేదు. బహుశా ఈ ఆర్థిక సంవత్సరంలో మంజూరయ్యే అవకాశం ఉంది. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

– సత్యనారాయణ, ఏఈఈ, ఆర్‌అండ్‌బీ, మునగాల

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి


కోదాడరూరల్ : సనా కళాశాల విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కోదాడరూరల్ : పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చందర్‌రావు, పీవైఎల్ ప్రధాన కార్యదర్శి డి.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫీజులు విడుదల చేయకుండా జాప్యం చేయడంపై బుధవారం పట్టణ పరిధిలోని సనా ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాల విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా రూ.7200 కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందని తెలిపారు. డాక్టర్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రియింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. అందాల పోటీలకు రూ.200 కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయకపోవడం ఎంటని వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి పులి రాఖీ, ఉమేష్, పరమేష్, అలేఖ్య, సంధ్య, రమ్య, సాహితి, సులోచన, మంజుల తదితరులు ఉన్నారు.

అనురాగ్ కళాశాల వద్ద..

అనంతగిరి : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి పులి రాఖీ కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా నేటి వరకు విద్యార్థులకు ఫీజులు విడుదల చేయకపోవంతో బుధవారం మండల కేంద్రంలోని అనురాగ్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో కలిసి నిరసన తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి చందర్‌రావు, పీవైఎల్ జిల్లా కార్యదర్శి డి.రవి, ఉమేష్, రాజేష్, సురేష్, రాజు, వికాస్, సంధ్య, అనిత, తదితరులు పాల్గొన్నారు.

మిట్స్ కళాశాల వద్ద..

చిలుకూరు : పెండింగ్ స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని పలువురు పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం చిలుకూరు మండల పరిధిలోని మిట్స్ బీఫార్మసీ కళాశాల ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి చందర్‌రావు, డివిజన్ ప్రధాన కార్యదర్శి పులి రాఖీ, నాయకులు రవి, ఉమేష్, రమ్య, సాహితి, సులోచన, మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల్లో వివేకాన్ని పెంపొందించిన వ్యక్తి బీవీ పట్టాభిరామ్


బీవీ పట్టాభిరామ్ గతంలో హుజూర్‌నగర్‌కు వచ్చినప్పటి చిత్రం

హుజూర్‌నగర్ : ప్రజలలో వివేకాన్ని, విచక్షణను పెంపొందించిన వ్యక్తి, ప్రముఖ మెజిషియన్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు, రచయిత బీవీ పట్టాభిరామ్ అని స్పందన సామాజిక అధ్యయన వేదిక సభ్యులు అన్నారు. బీవీ పట్టాభిరామ్ మృతి పట్ల బుధవారం హుజూర్‌గర్‌లో వేదిక తరపున సంతాపం తెలిపి మాట్లాడారు. పట్టణంలో స్పందన సంస్థ మోడల్ రోడ్ నిర్మాణానికి అవసరమైన నిధు ల సమీకరణ కోసం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమానికి బీవీ పట్టాభిరామ్ స్వచ్ఛందంగా హాజరై తన ప్రదర్శనతో ఆకట్టుకున్నట్లు గుర్తు చేశా రు. ప్రభుత్వ కళాశాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వ్యక్తిత్వ వికాస కార్యక్రమానికి హాజరై ప్రసంగించిన సందర్భాన్ని వారు స్మరించుకున్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేష్‌దీనదయాళ్

మునగాల : అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషిచేయాలని ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్ కోరారు. బుధవారం మండలంలోని కలకోవలో తెలంగాణ సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ప్రభుత్వ పథకం పేదలకు అందాలనే ఉద్దేశ్యంతో ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. పథకాలు అందని వారు తిరిగి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా టీమ్ లీడర్ పల్లెల లక్ష్మణ్, కళాకారులు పాలకుర్తి శ్రీకాంత్, పల్లెల రాము, గంట భిక్షపతి, గడ్డం ఉదయ్, పాక ఉపేందర్, కుందమల్ల నాగలక్ష్మి, గజ్జి మంజుల, సిరపంగి రాధ, మల్లమ్మ పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి


హుజూర్‌నగర్ : రుణాల మంజూరు పత్రం అందజేస్తున్న సుధా బ్యాంకు ఎండీ గణేష్

హుజూర్‌నగర్ : సుధా బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు ఎండీ పెద్దిరెడ్డి గణేష్ కోరారు. బుధవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సుధా బ్యాంకు రుణమేళాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖాతాదారులకు రుణాల మంజూరుపత్రాలు అందజేసి మాట్లాడారు. బ్యాంకు ఆధ్వర్యంలో 16 రకాల రుణాలను కాలయాపన లేకుండా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఎం సురేష్, ఆఫీసర్ రమేష్, సిబ్బంది ఖాతాదారులు పాల్గొన్నారు.

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని సుధా బ్యాంకు ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన రుణమేళాను బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ ప్రారంభించి మాట్లాడారు. ఖాతాదారుల సంక్షేమం కోసం తక్కువ వడ్డీకే బంగారు, గృహ, వాహన, విద్యా వంటి అన్నిరకాల రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోదాడ బ్రాంచ్ మేనేజర్ చెన్నూరి రవికుమార్, సిబ్బంది ఉన్నారు.

ప్రజల్లో చైతన్యానికి పోలీస్ ప్రజా భరోసా


మాట్లాడుతున్న సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్ : ప్రజలను చైతన్యం చేయడమే పోలీస్ ప్రజా భరోసా లక్ష్యమని సీఐ చరమందరాజు అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోని గోవిందపురంలో నిర్వహించిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ బలరామిరెడ్డి, పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్‌ను తాకట్టు పెట్టిన బీజేపీ ప్రభుత్వం


మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

నేరేడుచర్ల : తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయనాయుడు కోరారు. బుధవారం నేరేడుచర్లలోని బీసీ హక్కుల సాధన సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ భవిష్యత్‌ను కేంద్ర ప్రభుత్వం అంబానీ, అదానీ కాళ్ల దగ్గర తాకట్టు పెట్టిందని ఆరోపించారు. సమావేశంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, జిల్లా సహాయ కార్యదర్శి కోమర్రాజు వెంకట్, కీత సైదులు, పరికె భరత్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న వారాహి నవరాత్రి పూజలు

సూర్యాపేట : పట్టణంలోని సంతోషిమాత ఆలయంలో ఆషాడమాసం సందర్భంగా శ్రీవారాహి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం 7వ రోజు మత్స్య వారాహి దేవిగా అమ్మవారు పూజలు అందుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయం అర్చకుడు బట్టారం వంశీకృష్ణశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రుల్లో విశేషంగా ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో అర్చనలు జరిపారు. దేవాలయ అధ్యక్షుడు నూక వెంకటేశ్వంగుప్తా, ప్రధాన కార్యదర్శి బ్రాహ్మాడ్లపల్లి మురళీధర్, కమిటీ సభ్యులు బజ్జూరి శ్రీనివాసు, దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం, జలందర్, శివ పార్వతి, నీలిమ పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

సూర్యాపేట అర్బన్ : నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమల రక్షణకు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, ప్రతి కార్మికుడికి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు దంతాల రాంబాబు అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు సైదులు, కోట గోపి, తదితరులు పాల్గొన్నారు.

కంఠమహేశ్వరస్వామి ఆలయ నిర్మాణ కమిటీ ఎన్నిక


శ్రీకంఠమహేశ్వర ఆలయ నిర్మాణ నూతన కమిటీ సభ్యులు

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీకంఠ మహేశ్వర స్వామి దేవాలయ నిర్మాణం కోసం బుధవారం గౌడ కుల పెద్దగౌడ్ బత్తిని ధర్మయ్యగౌడ్, ఉపగౌడ్ వీరబాబుగౌడ్ సమక్షంలో సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ కులస్తులు ప్రతి కుటుంబం నుంచి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పొనుగోడులో గరిడేపల్లి ప్రధాన రహదారి పక్కన ఆలయం నిర్మించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడకుల పెద్దలు, నిర్మాణ కమిటీ, గౌడ యువజన సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బురద రోడ్డుపై నాట్లు వేసి నిరసన


5వ వార్డులో రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

హుజూర్‌నగర్ : గత రెండు రోజులుగా కురుస్తున్న చిరుజల్లులకు హుజూర్‌నగర్ పట్టణంలోని 5వ వార్డులో నాగమయ్య గుడికి వెళ్లే దారి బురదమయంగా మారింది. దీంతో బుధవారం ఆ కాలనీవాసులు బురద రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీసీ రోడ్డు వేయాలని స్థానిక ప్రజాప్రతినిధులకు, మున్సిపల్ అధికారులకు అనేకసార్లు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కొద్దిపాటి వర్షం వచ్చినా రోడ్డు మొత్తం బురదమయమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. విద్యార్థులు, వృద్ధులు బురదలో జారి పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి తక్షణమే సీసీరోడ్డు నిర్మించాలని వారు కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు యరగాని శ్రీనివాస్, చిలకరాజు లింగయ్య, గంధం శ్రీనివాస్, అష్రఫ్‌అలీ, ఆత్కూరి రంగారావు, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్సీ పరామర్శ


నిజాముద్దీన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు, లింగగిరి గ్రామానికి చెందిన నిజాముద్దీన్ ఇటీవల మృతి చెందారు. బుధవారం మండలంలోని లింగగిరిలో నిజాముద్దీన్ కుటుంబసభ్యులను ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ పరామర్శించారు. ఈ సందర్భంగా నిజాం మృతికి కారణాలు తెలుసుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధిత కుటుంబానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సహకారం అందిస్తామని తెలిపారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు సాముల శివారెడ్డి, అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, దొంగరి వెంకటేశ్వర్లు, దొంగరి సత్యనారాయణ, చక్కర వీరారెడ్డి, గూడెపు శ్రీనివాస్, మంజునాయక్, అజీజ్ పాషా, మోతీలాల్, గోపాల్ నాయక్, ఎం.వెంకటేశ్వర్లు, గోపాలరావు, రాఘవయ్య, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా


మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న డబ్బాకొట్ల యజమానులు

కోదాడ : మున్సిపల్ కార్యాలయం చుట్టూ ఉన్న డబ్బాకొట్లతో పాటు సమీపంలోని కల్యాణ మండపం వద్ద ఉన్న డబ్బాకొట్లను తొలగించాలని మున్సిపాలిటీ అధికారులు నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ బుధవారం పలువురు డబ్బాకొట్ల యజమానులు కోదాడ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబ్బాకొట్లను తొలగించి తమను రోడ్డును పడేయొద్దని కోరారు. 30 సంవత్సరాలుగా డబ్బా కొట్లపై ఆధారపడి జీవిస్తున్నామని తెలిపారు. ఆ ప్రాంతంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి తమకు దుకాణాలను కేటాయిస్తామని రాతపూర్వకంగా హామీ ఇస్తేనే డబ్బా కొట్లను ఖాళీ చేస్తామని తెలిపారు. అలాకాకుండా తమను బలవంతంగా ఖాళీ చేయించాలని చూస్తే ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత తప్పనిసరి


చిలుకూరులో ఇంకుడు గుంత నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ గిరిబాబు

చిలుకూరు : ప్రతి ఇంట్లో తప్పని సరిగా ఇంకుడు గుంత నిర్మించుకోవాలని ఎంపీడీఓ గిరిబాబు సూచించారు. బుధవారం చిలుకూరు మండల కేంద్రంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇంకుడు గుంతలు నిర్మించి భూగర్భ జలాలు పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. గ్రామాల్లో వ్యక్తిగత, కమ్యూనిటీ తరహాలో ఇంకుడు గుంతలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ ముక్కపాటి నరసింహారావు, గ్రామ కార్యదర్శి షరీఫ్‌వుద్దీన్, ఏపీఓ నిర్మల, టీఏ మాధవి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గీత కార్మికులందరికీ లైసెన్సులు


గీత కార్మికులకు లైసెన్సులు అందజేస్తున్న కేఎల్ఎన్ ప్రసాద్

కోదాడరూరల్ : అర్హులైన గీత కార్మికులందరూ తప్పనిసరిగా లైసెన్సులు పొందాలని గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు కేఎల్‌ఎన్ ప్రసాద్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కాపుగల్లులో గీత కార్మికులకు మంజూరు చేయించిన లైసెన్సులు, గుర్తింపు కార్డులను ఆయన అందజేసి మాట్లాడారు. గీత కార్మికులు లైసెన్సులు పొంది ప్రభుత్వం అమలు చేసే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిల సహాయంతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో గీత కార్మికులందరికీ లైసెన్సులు ఇప్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాసాని రామారావు, కాసాని వీరబాబు, లక్ష్మణ్, వాత్సవాయి పుల్లయ్య, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు ఉన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత


సత్సంగంలో మాట్లాడుతున్న పవిత్రమ్మ

హుజూర్‌నగర్ : దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని భగవాన్ శ్రీ రామదూతస్వామి ఆశ్రమ శిష్యులు కాలభైరవ బాబా, అరుణమ్మ, పవిత్రమ్మ అన్నారు. హుజూర్‌నగర్ పరిధిలోని మాధవరాయుని గూడెంలో మంగళవారం రాత్రి సువర్ణలక్ష్మీ దాంపత్య వ్రతం, సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని హైతాబాద్‌లో గల భగవాన్ శ్రీ రామదూత స్వామి దివ్యధామంలో జూలై 10 న గురు పౌర్ణమిని పురస్కరించుకొని అభీష్టసిద్ధి మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు స్వామి వారి దర్శనం పొంది ఆశీస్సులు అందుకోవాలన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో గడ్డం రామయ్య, శ్రీలక్ష్మి, అంజయ్య, మట్టమ్మ, నరసింహారావు, త్రివేణి, శ్రీదేవి, నాగమణి, లక్ష్మీ, వీరబాబు, శంకరాచారి, భక్తులు పాల్గొన్నారు.

తొలి ఏకాదశి వేడుకల కరపత్రం ఆవిష్కరణ


కరపత్రం ఆవిష్కరిస్తున్న విశ్వబ్రాహ్మణ నిత్య అన్నదాన సత్రం కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్ : ఏకాదశి పర్వదినం సందర్భంగా మట్టపల్లి క్షేత్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చే విశ్వబ్రాహ్మణులు, భక్తులకు గల విశ్వబ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రంలో అన్నదానం నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డుపల్లి సుందరయ్య, తునికిపాటి జగన్నాథచారి తెలిపారు. బుధవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన విశ్వబ్రాహ్మణ నిత్య అన్నదాన సత్రం కమిటీ సర్వసభ్య సమావేశంలో తొలి ఏకాదశి వేడుకల కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. అన్నదానానికి దాతలు సహకరించాలనుకునే వారు కమిటీని సంప్రదించాలని కోరారు. కోశాధికారి కొండ త్రయంబకాచారి, ఉపాధ్యక్షుడు చేపూరి నరసింహచారి, నాసరయ్య చారి, విష్ణుమూర్తి, నవీన్, వెంకటాచారి, వంశీకృష్ణ, ముత్తయ్యాచారి తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో బుధవారం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహునికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, మూల విరాట్‌స్వామికి పంచామృతాభిషేకం చేశారు. స్వామి, అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రక్తి గట్టించారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాభందనం, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్యకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లి రావు, ఈవో సిరికొండ నవీన్‌కుమార్, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు